సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం • 9 • మే • 2023



ఆస్తి రాయించుకుని.. ఇంటినుంచి గెంటేశాడు

తనకున్న యావదాస్తిని కొడుకు పేరుతో రాసి ఇస్తే.. కనికరం లేకుండా తనను ఇంటి నుంచి గెంటేశాడని ఓ వృద్ధ తండ్రి కోర్టులో కేసు వేశారు. - 8లో



ఇనుపరాడ్డుతో యువకుడి దారుణ హత్య

ఓ పెట్రోలు బంకులో ఏర్పడిన వివాదంతో క్షణికావేశానికి గురైన యువకులు, మరో యువకుడిపై ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడి హత్య చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.136
రెండోరకం	రూ.70	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 503 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	401	470
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 734.34 కిలోలు

న్యూస్‌రీల్

బీహెచ్‌ఈఎల్ వరకు స్టార్‌లైనర్

మదనపల్లె సిటీ : హైదరాబాదు స్టార్‌లైనర్ బస్సును బీహెచ్‌ఈఎల్ వరకు పొడిగించినట్లు ఆర్టీసీ మదనపల్లి వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు ఈ బస్సు బయలుదేరుతుందన్నారు. ఎంజీబీఎస్‌కు ఉదయం 5.40 గంటలకు, బీహెచ్‌ఈఎల్‌కు ఉదయం 6.40కు చేరుతుందన్నారు. బీహెచ్‌ఈఎల్ నుంచి రాత్రి 7.15 గంటలకు బయలుదేరి, ఎంజీబీఎస్ నుంచి రాత్రి 9.30 గంటలకు కదిలి మదనపల్లెకు ఉదయం 7 గంటలకు చేరుతుందన్నారు. మదనపల్లె నుంచి బీహెచ్‌ఈఎల్‌కు లోయర్ బెర్త్ చార్జీ రూ.1370, మదనపల్లె నుంచి ఎంజీబీఎస్‌కు లోయర్‌బెర్త్ చార్జీ రూ.1330, అప్పర్‌బెర్త్ చార్జీ రూ.1220 చెల్లించాలన్నారు.

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 19వ తేదీ ఉదయం 9.00 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇన్‌చార్జి మంత్రి, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా స్థాయి అధికారులంతా ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. జిల్లా అధికారులు తమతమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధికి సంబంధించిన నివేదికలను తీసుకు రావాలని సూచించారు.

నేటి నుంచి ఫెయిలైనవారికి తరగతులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా 10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టు టీచర్స్ మంగళవారం నుంచి రెమిడియల్ క్లాసులను సప్లిమెంటరీ పరీక్షలకు ముందు రోజు వరకు నిర్వహించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ప్రతి రోజు విద్యార్థుల హాజరును ఆయా పాఠశాలల హెడ్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలుంటాయని తెలిపారు.

ఎస్‌ఏల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ ఉమ్మడి కడప జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో మంజూరైన 92 పీజీటీ పోస్టులకు సబ్జెక్టు బోధించుటకు అర్హత, ఆసక్తిగల స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి సోమవారం తెలిపారు. దరఖాస్తును www.kadapadoe.in వెబ్‌సైట్‌లో పొందుపరచాలని తెలిపారు. అలాగే నిర్ణీత ప్రొఫార్మాలో అర్హత ధ్రువపత్రాలు జతచేసి 9వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయంలో అందచేయాలన్నారు.

గడువు పొడిగింపు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, కీబోర్డు సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు 10 సంవత్సరాలు నిండిన వారెవరైనా అర్హులన్నారు. తరగతులు ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు

సర్కారు వైద్యం.. పేదలకు వరం

- కార్పొరేట్‌కు దీటుగా.. పేదవాడికి అండగా
- ప్రభుత్వ ఆసుపత్రులలో ఆధునిక పరీక్షలు.. వైద్య సేవలు
- రూ.40 లక్షలతో రాయచోటి, మదనపల్లి, రాజంపేటలలో వైద్యపరీక్ష పరికరాలు ఏర్పాటు
- పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రాయచోటిలో ప్రజలకు సేవలు అందిస్తున్న వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్

రాయచోటి : ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ఇంటి వద్దనే వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అలాగే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సుమారు 60 రకాల పరీక్షలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ)లలో నిర్వహించే విధంగా అత్యాధునిక పరికరాలను సమకూర్చింది. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలకు వీటిని సరఫరా చేశారు. 60 రకాల పరీక్షలు చేయాలంటే ప్రైవేట్ ఆసుపత్రి ల్యాబ్‌లలో కనీసం రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చు అవుతుంది. అలాంటిది నయాపైసా ఖర్చు లేకుండా ప్రభుత్వాసుపత్రులలో ఉచితంగా పరీక్షలు చేసే అవకాశం కల్పించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఇటీవల ప్రారంభించిన హెల్త్ సెంటర్లలో ఆధునిక ల్యాబ్ పరికరాలు సమకూర్చడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. పట్టణ ఆరోగ్య కేంద్రంలో మైనర్ ఓటీ, జనరల్ వార్డు, లేబర్ రూము ప్రత్యేకంగా ఉన్నాయి. ఎమర్జెన్సీ కేర్ కింద ఈసీజీ, నెబులైజర్, సక్షన్ ఆపరేటస్, ఓ2 కాన్‌సన్ట్రేట్, వీల్‌చైర్స్‌తో పాటు అధునాతన పరికరాలతో కూడిన కంప్యూటరైజ్డ్ లేబొరేటరీ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. నిత్యం భారీ సంఖ్యలో రోగులు ఈ హెల్త్ సెంటర్‌కు వచ్చి రకరకాల పరీక్షలు, వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తోంది. ఈ పథకం కింద 3,255 రోగాలకు ఉచితంగా చికిత్స అందుతోంది.

రూ.40 లక్షలతో రాయచోటి, మదనపల్లి, రాజంపేటలలో వైద్య పరీక్షా పరికరాలు

రాయచోటికి నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలు మంజూరు కాగా అన్ని నిర్మాణాలు పూర్తి చేసుకొని సేవలందిస్తున్నాయి. వీటిలో రూ.12 లక్షల ఖర్చుతో వైద్య పరికరాలను ఏర్పాటు చేసి ఉచితంగా ప్రజలకు వైద్య పరీక్షలు అందిస్తున్నారు. అలాగే మదనపల్లికి 5 పట్టణ ఆరోగ్య కేంద్రాలు మంజూరు కాగా 4 ఆరోగ్య కేంద్రాలలో రూ.12 లక్షల ఖర్చుతో వైద్య పరికరాలు, రాజంపేటకు 2 పట్టణ ఆరోగ్య కేంద్రాలు మంజూరు కాగా రూ.6 లక్షల ఖర్చుతో వైద్య పరికరాలను ఏర్పాటు చేశారు. మిగిలిన నియోజకవర్గాలైన రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లిలలో కూడా వైద్య పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

రక్తహీనత నివారణ.. నేత్ర పరీక్షలు

గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించడం ద్వారా రక్తహీనత సమస్యను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అలాగే గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోనే అవసరమైన వారికి కంటి పరీక్షలు చేసి నేత్ర సమస్యలను నివారిస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో 2022 అక్టోబర్ మాసం నుంచి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలవుతోంది. ఈ కార్యక్రమం కింద జిల్లాలోని 375 వైఎస్‌ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలలో 369 మంది వైద్యులు 1,74,284 మందికి అవసరమైన పరీక్షలు చేసి ఇంటివద్దనే ఉచితంగా వైద్యసేవలు అందజేశారు. జనరల్ ఓపీ కింద 94,497 పేషెంట్లు, గర్భిణులు 12,927 మంది, బాలింతలు 7,173, రక్తహీనత 602, కౌమారదశ బాలికలు 133, రక్తపోటు 25,148 చక్కెరవ్యాధిగ్రస్తులు 19,957, రక్తపోటు, చక్కెర వ్యాధి కలిగిన వారు 13,055, ఓరల్‌క్యాన్సర్ 243, సెర్వికల్‌క్యాన్సర్ 311, బ్రెస్ట్ క్యాన్సర్ 63, టీబీ పేషెంట్లు 175 మందికి ఉచితంగా వైద్యసేవలు అందించారు.

వైద్యపరీక్షలు ఇంత బాగా చేస్తారనుకోలేదు



అనారోగ్యంతో ప్రైవేట్ హాస్పిటల్‌కు పోతే వేయ్యి రూపాయలు అయిపోతాయి. మా సమీపంలోని ఎస్‌ఎన్ కాలనీ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చూపించుకుంటున్నాను. నర్సులు, డాక్టర్లు బాగా చూసి అవసరమైన వైద్య పరీక్షలను కూడా ఉచితంగా చేస్తున్నారు. ఇలా చూస్తారని ఎప్పుడూ అనుకోలేదు. – రెడ్డమ్మ, కొత్తపేట, రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా

మా ఇంటిదగ్గరే హాస్పిటల్



మా ఇంటి దగ్గర కాలనీలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హాస్పిటల్ నిర్మించారు. నాకు ఆరోగ్యం బాగాలేక పోతే అక్కడికి వెళ్లి పరీక్షలు చేయించాను. ఇంతకు ముందు ప్రైవేట్ హాస్పిటల్‌కి పోతే పరీక్షలకు రూ.600 అయ్యేవి. అవన్నీ ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేసి మందుబిల్లలు ఇచ్చారు. – షేక్ వహీదా, అలీమాబాద్‌వీధి, రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



వైద్యపరంగా పేదవాడి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామస్థాయిలో వైఎస్ ఆర్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైద్య, విద్యరంగాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. పట్టణాలలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకుంది. – గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే

పేదలకు మెరుగైన వైద్యసేవలు



పేదలకు మెరుగైన వైద్యసేవలను ఉచితంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అదే గ్రామంలో వైద్యసేవలు అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీని ప్రభుత్వం మరింత పటిష్టం చేసింది. ఉచిత వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. – గిరీషా పీఎస్, కలెక్టర్

బాధ్యతలు స్వీకరించిన 'దిశ' డీఎస్పీ



కడప అర్బన్ : వైఎస్ ఆర్ జిల్లా కడప 'దిశ' డీఎస్పీగా ఎస్.రమాకాంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన 1991లో ఎస్‌ఐగా పోలీసు శాఖలో విధుల్లో చేరారు. కడప తాలూకాతో పాటు పలు పోలీస్‌స్టేషన్‌లలో విధులను నిర్వహించారు. 2005లో సీఐగా పదోన్నతి పొందారు. సీబీడీలో, రైల్వేకోడూరులో, ఇతర ప్రాంతాల్లో విధులను నిర్వహించారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన తరువాత అనంతపురం జిల్లా ధర్మవరంలో విధులను నిర్వహించారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయన కడప 'దిశ' డీఎస్పీగా నియమితులై బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పకడ్బందీగా పాలిసెట్



చీఫ్ సూపరింటెండెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కో–ఆర్డినేటర్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 10వ తేదీ బుధవారం నిర్వహించనున్న పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలను తీసుకున్నామని పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. సోమవారం కడప సమీపంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7879 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్షను రాయనున్నారన్నారు. ఇందుకోసం కడప, ప్రొద్దుటూరులతో కలిపి జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు.

వారంలోగా ఎన్‌సీడీ–సీడీ సర్వే పూర్తి చేయాలి

కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లాలో వచ్చేవారంలోగా ఎన్‌సీడీ–సీడీ సర్వేను 90శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ హాలు నుంచి ఎన్‌సీడీ–సీడీ సర్వే, ఏఎన్‌ఎం ఫీడ్‌బ్యాక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, అనీమియా నివారణ తదితర అంశాలపై వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. కొన్ని పీహెచ్‌సీలు సర్వే ప్రగతిలో వెనుకబడి ఉన్నాయన్నారు. కారణాలు తెలుసుకొని వచ్చే వారంలోగా లక్ష్యం మేరకు ప్రగతి సాధించాలన్నారు. సర్వే చేయడం, ప్రగతి సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆశా, ఏఎన్‌ఎంలు ప్రజలను సచివాలయానికి తీసుకువచ్చి ఎన్‌సీడీ–సీడీ సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారులు స్వయంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో రక్తపోటు, మధుమేహం, సస్పెక్టెడ్ కేసులను గుర్తించి పరీక్షలు చేయాలన్నారు. రక్తహీనతలేని జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు,ఆశా, ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన ద్వారా అందిన ప్రతి అర్జీని నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించేలా చూడాలని అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో అర్జీదారుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. అర్జీల స్వీకరణలో డీఆర్‌ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించి వారి జీవితాలలో సంతోషం నింపే దిశగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలుగజేయాలన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

జిల్లాలో ఉపాధిహామీ పనులలో కూలీల సంఖ్య పెంచి వలసల నివారణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు అంశాలపై అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మే, జూన్ మాసంలో ఉపాధి కూలీల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వేలో భాగంగా ఈకేవైసీ పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే పెండింగ్ లేకుండా భూహక్కు పత్రాలు త్వరగా రైతులకు పంపిణీ చేయాలన్నారు. దేవదాయశాఖకు సంబంధించిన భూములను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చుకొని మండల దేవదాయశాఖ అధికారులు, సంబంధిత తహసీల్దార్లను సంప్రదించి 22ఏ1సీలో కొత్తగా చేర్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంకా పట్టాలు ఇవ్వాల్సి ఉంటే తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి లే అవుట్ సిద్ధం చేయాలన్నారు. చుక్కల భూమి 22(ఏ) నుంచి ఏ భూమి అయితే తీసి ఉంటామో ఆ సర్వే నంబరులో ఉన్న రైతులకు ముఖ్యమంత్రి పేరిట త్వరగా జాబితా పంపాలన్నారు. సబ్ కొత్త పోలీస్ స్టేషన్ నిర్మాణానికి తమ పరిధిలో భూమిని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు.

అతివలకు లాభం.. ప్రజలకు సౌకర్యం

- విజయవంతంగా చేయూత మార్ట్
- ఐదు నెలల్లోనే రూ.కోటి పైగా వ్యాపారం
- ప్రజలకు సౌకర్యంగా.. అందుబాటులో ధరలు



మహిళా చేయూత మార్టు

ఖాజీపేట : మహిళలు తలచుకుంటే ఏదైనా సాధిస్తారు .. అందుకు నిదర్శనం ఖాజీపేటలోని మహిళా చేయూత మార్ట్ చెప్పవచ్చు.. నేటి పోటీ వ్యాపారంలో తట్టుకుని అందరికన్నా భిన్నంగా.. ఆలోచిస్తూ తక్కువ ధరకే సరుకులతో పాటు నాణ్యమైన శుభ్రమైన సరుకులు వినియోగదారులకు ఇస్తున్నారు. ఫలితంగా వ్యాపారం బాగా వృద్ధి చెందడంతోపాటు మంచి లాభాలను గడిస్తున్నారు. ఫలితంగా ఇతర మహిళా మార్టులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 మహిళా మార్టులను ఏర్పా టు చేయాలని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగా ఖాజీపేటను ఎంపిక చేశారు. మహిళా మార్టు ఏర్పాటుకు పెట్టుబడిగా ప్రతి సభ్యురాలు రూ.300 చొప్పున గ్రూపు నుంచి రూ. 3వేలు వసూలు చేశారు. ఇలా మండలంలో 950 గ్రూపులకు గాను రూ. 23లక్షలు పెట్టుబడిగా వచ్చింది. 2022 నవంబర్ 28న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతుల మీదుగా మహిళా మార్టును ప్రారంభించారు.

విజయవంతంగా..

ఖాజీపేట లాంటి చోట మహిళామార్టులు విజయవంతంగా నడుస్తాయా అని అందరూ భావించారు. అయితే డ్వాక్రా మహిళల సహకారం.. అధికారుల పర్యవేక్షణతోపాటు మార్కెట్‌లో లభించే ధరలకంటే తక్కువ ధరకు, నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందించేలా సిబ్బంది కృషి చేశారు. ఫలితంగా 5 నెలల్లోనే రూ.కోటికి పైగా వ్యాపారం చేస్తూ విజయవంతంగా మహిళామార్టు నడుస్తోంది.

లాభాలు అన్నీ సభ్యులకే

మహిళా మార్టులో జరిగే వ్యాపారం వల్ల వచ్చే లాభాలు అన్ని మార్టులో పెట్టుబడి పెట్టిన సభ్యులకే. ప్రతి సంవత్సరం వచ్చిన ఆదాయంలో ఖర్చులను తీసి వచ్చిన ఆదాయాన్ని ప్రతి సభ్యురాలికి అందజేస్తామని అధికారులు అంటున్నారు. ప్రతి నెల ఆడిటింగ్ జరుగుతుందని వారు చెబుతున్నారు.

మార్చికల్లా 15 మార్టుల ఏర్పాటు

జిల్లాలో 15 మార్టులను ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. ఖాజీపేటలో విజయవంతం కావడంతో వేంపల్లి, పోరుమామిళ్ల, బద్వేలులో ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే స్థల పరిశీలన చేపట్టారు.

టమాట రైతు కంట కన్నీరు!

ధరలేక పొలాల్లోనే వదిలేసిన వైనం

పెద్దతిప్పసముద్రం : తంబళ్లపల్లి నియోజకవర్గంలో టమాట పంట సాగు చేసిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. పంట ఆరంభం నుంచి కోత దశ వరకు అష్ట కష్టాలు పడి సాగు చేసినా ఇటు తెగుళ్లు, అటు నిలకడ లేని ధరల కారణంగా పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. నియోజకవర్గంలో సుమారు మూడు వేల హెక్టార్లకు పైగా టమాట పంటను సాగు చేసిన రైతులు మరోసారి ఘోరంగా దెబ్బ తిన్నారు. పంట చేతికి వచ్చే సమయానికి టమాట ధరలు ఒక్కసారిగా పతనం కావడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ధరలు జూదంలా మారడంతో దిక్కుతోచక పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చేదని రైతులు కుమిలిపోతున్నారు. మార్కెట్‌లో టమాట ప్రస్తుతం కిలో 10 రూపాయలకు లోపే పలుకుతోంది. కూలీల ఖర్చు, రవాణా చార్జీలకు కూడా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు రైతులైతే రవాణా చార్జీలు దండగని భావించి కాయలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. మండలంలో 625 హెక్టార్లలో రైతులు టమాటా పంటను సాగు చేశారు. నాలుగు నెలల క్రితం వరకు టమాటా ధరలు రైతులను ఊరించాయి. అనంతరం ఉసూరుమనిపించాయి. 30 కిలోల టమాటా బాక్సు మార్కెట్‌లో రూ.100ల నుంచి రూ.150ల లోపే పలకడంతో రైతులు మథనపడిపోతున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేయించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



పొలాల్లోనే వదిలేసిన టమాటా

పెట్టుబడి కూడా చేతికందలేదు

ఒకటిన్నర ఎకరా టమాటా పంట సాగు చేశా. నారు, దున్నకాలు, కూలీలు, క్రిమి సంహారక మందులకు కలిపి రూ.లక్షకు పైగా ఖర్చు వచ్చింది. పంట దిగుబడి బాగా వచ్చినా ధరలు మాత్రం గణనీయంగా తగ్గిపోయాయి. కాయలు కోసి మార్కెట్‌కు తరలిస్తే కూలీలు, రవాణా చార్జీల సొమ్ము కూడా చేతికందడం లేదు. ధరల్లేక చాలా మంది రైతులు కాయలను పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఏం చేయాలో దిక్కు తోచడం లేదు. నష్టపోయిన టమాటా రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. – మోహన్, టమాటా రైతు, పీటీఎం మండలం.

పుస్తకాల నిలయం.. ఆట పాటల సమయం

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

మదనపల్లె సిటీ : వేసవి సెలవుల్లో ఆటపాటలు, విజ్ఞానంతో కూడిన శిక్షణ ఇవ్వడానికి గ్రంథాలయాలు సిద్ధమయ్యాయి. జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో ఈనెల 8న సోమవారం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. వచ్చేనెల 11 వరకు కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 10 నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలంతా వీటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. సమీపంలోని విద్యార్థులను రప్పించి గ్రంథాలయాల్లో రోజూ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలు, మానసిక వికాసానికి ఆటపాటలు నిర్వహిస్తుంటారు. ఒక్కో గ్రంథాలయంలో సగటున 50 మంది వరకు వచ్చి వీటిని వినియోగించుకుంటారు. సోమవారం నుంచి మొదలైన శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీటిని నిర్వహిస్తారు. ఇందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ నిధులు కేటాయించింది.

ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాల సహకారంతో చేపట్టేలా అధికారులు ఆదేశాలిచ్చారు. ప్రజాప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు, రచయితలు తదితరుల సహకారం తీసుకోవాలన్నారు. శిక్షణకు సంబంధించి ఆయా అంశాల్లో అనుభవం ఉన్న వారిని గుర్తించి వారితో పిల్లలకు తర్ఫీదు ఇప్పించాలి. ఈ కార్యక్రమంపై ఇప్పటికే గ్రంథాలయాధికారులు విస్తృత ప్రచారం చేపట్టారు. ఇటీవల పాఠశాలలకు వెళ్లి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి కార్యక్రమాన్ని వివరించారు.



కురబలకోట గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

నిర్వహణ ఇలా..

- ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు కథలు వినడం
- 8.30 నుంచి 10 గంట వరకు పుస్తకాలు చదవడం, తర్వాత పది నిమిషాలు విరామం
- 10.30 నుంచి చదివిన అంశాలపై సమీక్ష
- 10.30 నుంచి 11 గంటల వరకు కథలు చెప్పడం
- 11 గంటల నుంచి 12 వరకు స్పోకెన్ ఇంగ్లీషు, క్రాఫ్ట్, నృత్యాలు, నాటికలు, బొమ్మలు తయారీ, ఆటలు ఆడించడం, అతిథులతో స్ఫూర్తిదాయక ప్రసంగాలు

ఎక్కువ మంది వినియోగించుకునేలా చూడాలి

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. కచ్చితంగా ప్రతి చోటా వీటిని నిర్వహించాలి. షెడ్యూలు ప్రకారం అన్ని కార్యక్రమాలు నిర్వహించాలి. ఇందులో పాల్గొనే విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ఇస్తాం. – ఎన్‌ఎస్ లావణ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి, ఉమ్మడి చిత్తూరు జిల్లా.

ఇరువర్గాల ఘర్షణ: 14 మందిపై కేసు

కలకడ : ఇరువర్గాల ఘర్షణలో 14 మందిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ సీటీ స్వామి తెలిపారు. సోమవారం మండలంలోని తాండ పంచాయతీ దిగువతాండ గ్రామానికి చెందిన హరిప్రసాద్‌నాయక్, ప్రేమ్‌కుమార్‌నాయక్‌లను గుర్రంకొండ మండలం, మర్రిపాడు పంచాయతీ సింగంవారిపల్లెకు చెందిన రాఘవేంద్రనాయక్, నరేష్ నాయక్, అనిల్‌నాయక్, సంజీవనాయక్, శివనాయక్, శ్రీనివాసనాయక్, గజేంద్రనాయక్. శశిభాయ్ కొట్టి గాయపరిచారు. బాధితుడు హరిప్రసాద్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు 8మందిపై,అదేవిధంగా రాజేంద్రనాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రేమ్‌కుమార్,పతి, గణపతి, మిఠాయి, రమేష్‌నాయక్, నగరాజ్‌నాయక్‌లపై కేసుమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇనుపరాడ్డుతో యువకుడి దారుణహత్య

రోడ్డు పక్కన చెట్ల పొదల్లో మృతదేహం



పఠాన్ అక్రమ్ మృతదేహం

మదనపల్లె : ఓ పెట్రోలు బంకులో ఏర్పడిన వివాదంతో క్షణికావేశానికి గురైన యువకులు, మరో యువకుడిపై ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడి హత్య చేశారు. ఈ సంఘటన మదనపల్లె మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సత్యసాయి జిల్లా తనకల్లు మండలం కోటూరుకు చెందిన పఠాన్ మౌలాలీ కుమారుడు పఠాన్ అక్రమ్ (24), మదనపల్లెలోని నక్కలదిన్నెలో కాపురమున్న బంధువులు ఖాదర్‌వల్లీ, షబానా ఇంటిలో ఉంటున్నాడు. నక్కలదిన్నెలో నిర్వహిస్తున్న వెల్డింగ్ దుకాణంలో పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మృతుడు అక్రమ్, వెల్డింగ్‌షాపు నిర్వాహకుడు ఖాదర్‌వల్లీ, నక్కలదిన్నెకు చెందిన వాటర్‌మ్యాన్ సుధాకర్, కార్పెంటర్ బషీర్, టెండో డ్రైవర్ రెడ్డిబాషాలు కలిసి చిప్పిలికి చెందిన వీరేంద్రప్రసాద్ ఆటోలో కర్ణాటక రాష్ట్రం రాయల్‌పాడుకు మద్యం తాగేందుకు వెళ్లారు. ఆరుగురు మద్యం తాగి తిరుగు ప్రయాణంలో కర్ణాటక సరిహద్దులోని ఓ పెట్రోలు బంకులో ఆటోకు డీజిల్ పట్టించేందుకు వెళ్లారు. పెట్రోల్ బిల్లు చెల్లింపునకు సంబంధించిన స్లిప్ బంకు నిర్వాహకులు ఇవ్వకపోవడంతో, అక్రమ్, రెడ్డిబాషాలు వారితో వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాలు గొడవ పడుతుండగా అదే సమయానికి వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందినవారిగా చెబుతున్న ముగ్గురు వ్యక్తులు ఏపీ21 ఏఎస్5483 నంబరు గల కారులో అక్కడికి డీజిల్ పట్టుకునేందుకు వచ్చారు. ముగ్గురు కలుగజేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది. అయితే అక్రమ్, రెడ్డిబాషాలు మద్యం మత్తులో కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులపై వాగ్వాదానికి దిగి గొడవపడ్డారు. వివాదం ఘర్షణకు దారి తీసింది. ఆవేశానికి గురైన ముగ్గురు వ్యక్తులు అక్రమ్, రెడ్డిబాషాలపై దాడి చేశారు. స్థానికంగా ఉన్న వారు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం ఆరుగురు ఆటోలో మదనపల్లెకు బయలుదేరారు. ఆవేశానికి లోనైన కారులోని వ్యక్తులు ఆటోను వెంబడించారు. ఆంధ్ర – కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చీకలబైలు వద్ద ఆటోకు అడ్డుగా కారు నిలిపి గొడవకు దిగారు. అందులో భాగంగా రెడ్డిబాషాపై మూకుమ్మడిగా దాడి చేశారు. దాడిలో అక్రమ్ మర్మాంగంపై తన్నడంతో భయపడి, ఆటో దిగి మదనపల్లె వైపు పరుగెత్తాడు. దీంతో వారు అక్రమ్‌ను వెండిస్తూ ఇనుపరాడ్డుతో తలపై బలంగా కొట్టారు. అక్కడి నుంచి పారిపోయారు. తలకు గాయమై అధిక రక్తస్రావం కావడంతో వేంపల్లె పంచాయతీ కూకటిమానుగడ్డ సమీపంలో జాతీయ రహదారి పక్కనున్న చెట్లలో పడి అక్రమ్ మృతి చెందాడు. అతనితోపాటూ ఉన్న వ్యక్తులు అక్రమ్ పారిపోయి ఇంటికి వెళ్లిపోయి ఉంటాడని వచ్చేశారు. తీరా ఇంటి వద్ద చూడగా అతను రాలేదని తెలిసింది. ఖాదర్‌వల్లీ రాత్రంతా గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం రోడ్డు పక్కన యువకుడు మృతి చెంది పడి ఉన్నట్లు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ కేశప్ప, తాలూకా సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ మురళీకృష్ణ, సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన యువకుడు నక్కలదిన్నెకు చెందిన వాడిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్రమ్‌తోపాటు వెళ్లిన ఖాదర్‌వల్లీ, రెడ్డిబాషా, బషీర్, సుధాకర్, వీరేంద్రప్రసాద్‌లు అక్కడికి చేరుకోవడంతో ఘటనకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. హత్యకు సంబంధించి ఐదుగురిని విచారించి వారి నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ తీసుకున్నారు. కారు ఫొటో, వాహనం నంబరును పోలీసులకు అందజేసి వివరాలు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా హత్యపై పలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు విచారణలో అక్రమ్‌తో వెళ్లిన వారు పొంతన లేని సమాధానాలు చెబుతుండటంతో పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో వారిలో వారే గొడవపడి హత్య చేశారా.. లేక పులివెందులవాసులు హత్యకు పాల్పడ్డారా.. అనే విషయాలు తేలాల్సి ఉందన్నారు. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేయనున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై చేనేత కార్మికుడి మృతి



శంకరయ్య మృతదేహం

మదనపల్లె : మద్యానికి బానిసై, అనారోగ్యం బారినడి ఓ చేనేత కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో జరిగింది. హిందూపురానికి చెందిన బి.శంకరయ్య (43) కొంతకాలం క్రితం కుటుంబంతో కలిసి ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వలసవచ్చాడు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో అద్దె ఇంటిలో నివాసముంటూ చేనేత కార్మికునిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన శంకరయ్య కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల అతిగా మద్యం సేవించడంతో ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. కుటుంబ సభ్యులు బాధితున్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ మృతి చెందాడు.

మృతదేహం వెలికితీత

రాజంపేట : ఊటుకూరు చెరువులోని మట్టిగుంతలో ఈతకు వెళ్లి మునిగిపోయిన ధనుష్ (20) మతదేహం సోమవారం బయటపడింది. కడప నుంచి వచ్చిన రెస్క్యూ టీం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టి ధనుష్ మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టరం నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతదేహాన్ని చూడగానే కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గంగిరెడ్డిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అక్రమ నిర్మాణాలు తొలగింపు



కడప క్రాస్‌లో హైవే పక్కన జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కురబలకోట: కురబలకోట మండలం కడప క్రాస్ వద్ద హైవే రోడ్డు 340 పక్కన నెలకొన్న అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఏడాది క్రితం ఇక్కడ ఆక్రమణల మార్కింగ్ వేశారు. హైవే రోడ్డు విస్తరణ పనులు కూడా పూర్తయ్యాయి. నేషనల్ హైవే స్థానిక డీఈ శివరాం ఆక్రమణలు తొలగించాలని ఏప్రిల్ 18న అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు నుంచి కూడా మార్కింగ్ ఉన్న ఆక్రమణలు తొలగిచాలని స్థానిక వీఆర్వో, వీఆర్ఏల ద్వారా హెచ్చరించారు. స్వచ్ఛందగా ఆక్రమణలు తొలగించాలని పలుమార్లు చెప్పినా వారు స్పందించలేదు. ఇక్కడ హైవే పక్కన 92 దాకా షాపులు, హోటళ్లు, ఇతర కట్టడాలు ఉన్నాయి. హైవే పక్కన వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆక్రమణలు తొలగించడానికి తహసీల్దారు ఎం, భీమేశ్వరరావు ఆధ్వర్యంలో జేసీబీతో వెళ్లారు. అప్పుడు కూడా ఆక్రమణలు తొలగించుకోవాలని ఆక్రమణదారులకు సూచించారు. ఇది వరకే ముందస్తుగా చెప్పడం కూడా జరిగిందన్నారు. ఎవ్వరూ నష్టపోకుండా మానవత్వంతో కోరిన గడువు ఇవ్వడం జరుగుతుందన్నారు. లేదంటే జేసీబీతో తొలగించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఆక్రమణలు తొలగించబోమని కొందరు ఈ సందర్భంగా తిరగబడ్డారు. పైగా జేసీబీకి అడ్డుపడ్డారు. అధికారుల విధులకు ఆటంకం కల్గించారు. దీంతో విధిలేని పరిస్థితిలో పోలీసు బందోబస్తుతో హైవే పక్కన వరుసగా ఉన్న ఆక్రమణలను జేసీబీతో తొలగించారు. 63 సెంట్ల స్థలంలో ఆక్రమణలు తొలగించినట్లు తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు తెలిపారు. గత ఆరునెలలుగా ఆక్రమణలు స్వచ్ఛంధంగా తొలగించాలని కోరినా తొలగించకపోవడంతో హైవే అధికారుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదన్నారు.

ఆస్తి రాయించుకుని..ఇంటి నుంచి గెంటేశాడు



సబ్‌కలెక్టరేట్‌లో వృద్ధుడు కృష్ణమూర్తిని విచారిస్తున్న ఆర్డీఓ మురళీ

మదనపల్లె : తనకున్న యావదాస్తిని కొడుకు పేరుతో రాసి ఇస్తే.. కనికరం లేకుండా తనను ఇంటి నుంచి గెంటేశాడని, వృద్ధాప్యంలో పోషణకు తనకు మెయింటెన్స్ ఇప్పించాల్సిందిగా ఓ తండ్రి సబ్ కలెక్టరేట్‌లో సీనియర్ సిటిజన్స్ కోర్టులో కేసు వేశాడు. ఇందులోభాగంగా సోమవారం ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ కేసును విచారించారు. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ అండేవారిపల్లెకు చెందిన అండేకృష్ణమూర్తి (85)కు ఒక కుమారుడు అండే వెంకటనాగేశ్వరం, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అండే కృష్ణమూర్తి పెద్ద భూస్వామిగా గ్రామంలో పేరు ఉండటమే కాకుండా మదనపల్లె పట్టణంలో కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. వీటన్నంటినీ ఆయన తన నలుగురు కూతుళ్లను కాదని, ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉంటున్న అండే వెంకటనాగేశ్వరం పేరుతో రాసి ఇచ్చాడు. ఆస్తి మొత్తం తన పేరు మీదకు బదలాయింపు జరిగాక వెంకటనాగేశ్వరం తండ్రిని పట్టించుకోకుండా ఇంటి నుంచి బయటకు పంపేశాడు. దీంతో ఆయన దిక్కుతోచని స్థితిలో భార్యతో కలిసి రెండో కుమార్తె వద్ద ఆశ్రయం పొందాడు. యావదాస్తిని కొడుకు పేరు మీద రాసి, వృద్ధాప్యంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్న దిగులుతో ఏడాదిన్నర క్రితం అండే కృష్ణమూర్తి భార్య చనిపోయింది. కుమార్తె వద్ద ఉంటున్న కృష్ణమూర్తికి ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తుండటంతో తన వైద్యఖర్చులకు ప్రతినెలా కుమారుడి నుంచి రూ.10,000 మెయింటెన్స్ ఇప్పించాల్సిందిగా సీనియర్ సిటిజన్స్ కోర్టులో కేసు వేశాడు. దీనిపై ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ ఇప్పటికే రెండుసార్లు విచారించి అండే వెంకటనాగేశ్వరంను హాజరుకావాల్సిందిగా కోరినప్పటికీ విచారణకు రాలేదు. దీంతో అతడికి ఫైనల్ నోటీసు పంపుతున్నామని, విచారణకు హాజరుకాని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

రాయచోటి : స్పందన ఫిర్యాదులకు చట్ట ప్రకారం సత్వరం పరిష్కారం చూపాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల స్పందన ద్వారా 55 మంది తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా విన్నవించారు. ఎస్పీ ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

కంటికి రెప్పలా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు జిల్లా అంగరక్షకులకు సూచించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో జిల్లా అంగరక్షకులకు అత్యాధునిక ఆయుధాలతో రెండో విడత శిక్షణను డీఎస్పీ పి మహబూబ్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి విపత్కర పరిస్థితినైనా అంచనా వేసి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏకే47, ఎల్ఎంజీ, కార్బన్, ఇన్సాస్, 9 ఎంఎం పిస్టల్, గ్రేనేడ్ లాంటి అత్యాధునిక ఆయుధాలు, మందుపాతరలపై పూర్తిస్థాయి అవగాహనను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అంగరక్షకులు ఇన్‌చార్జ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ జావిద్, ఆర్ఎస్ఐలు రవి, అమరనాథరెడ్డి, మురుగన్, ఏఆర్ఎస్ఐ గుణశేఖర్, అంగరక్షకులు పాల్గొన్నారు.

శభాష్..వేణుగోపాల్ రెడ్డి



బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందుకుంటున్న వేణుగోపాల్‌రెడ్డి

కురబలకోట : కర్ణాటక రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం తెట్టు గ్రామం గాలేటివారిపల్లెకు చెందిన బూదల వేణుగోపాల్ రెడ్డి బెస్ట్ ఫెర్మార్మింగ్ ఐఎస్‌టీఈ చాప్టర్ స్టూడెంట్ అవార్డు-23 అవార్డు దక్కించుకున్నారు. బెంగళూరు సిటీలో 270 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా ఇతనొక్కడికే ఈ అవార్డు లభించడం విశేషం. కర్ణాటక సెక్షన్ ఐఎస్‌టీఈ (ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఈ అవార్డు ఇచ్చింది. ప్రతి ఏటా కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా 23 మందికి ఈ అవార్డు ఇస్తారు. బీటెక్‌లో కాలేజీ ఫస్ట్ క్లాస్ వచ్చి ఉండి ఎక్స్‌ట్రా కరిక్యులమ్ యాక్టివిటీస్‌తో పాటు ఐఎస్‌టీఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటిన వారికి ఈ అవార్డు ఇస్తారు. ఇతను చదువు సంధ్యల్లో తొలి నుంచి ప్రతిభ చాటుతూ వస్తున్నారు. 2016లో పదిలో 9.8 మార్కులు సాధించారు. అప్పట్లో ప్రతిభ అవార్డు వచ్చింది. రూ. 20 వేల నగదు పురస్కారం, మెడల్, సర్టిఫికెట్, ట్యాబ్ లభించాయి. మదనపల్లె కృష్ణారెడ్డి సిద్దార్థ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివారు. 1000కి 974 మార్కులు సాధించారు. తర్వాత బెంగళూరు వేమన ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఈసీఈ చదివారు. అక్కడ కూడా పదికి 9.55 సీజీపీఏ వచ్చింది. ఇతనికి వేమన ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఐఎస్‌టీఈ కర్నాటక సెక్షన్ చైర్మన్ డాక్టర్ సురేష్ డీఎస్ చేతుల మీదుగా బెస్ట్ స్టూడెంట్ అవార్డు తీసుకున్నట్లు సోమవారం తెలిపారు.

కర్మక్రియల్లో తేనెటీగల దాడి

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలం శీలంవారిపల్లె పంచాయతీ గుడిపల్లెలో గతనెల 28న మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలు జరుతుండగా తేనెటీగలు దాడి చేయడంతో 30 మందికిపైగా గాయపడిన ఉదంతం తెలిసిందే. సోమవారం మృతి చెందిన వ్యక్తి కర్మక్రియలు నిర్వహించేందుకు వెళ్లిన బంధువులు, గ్రామస్తులపై మళ్లీ తేనెటీగలు దాడి చేయడంతో తలోదిక్కున పరుగులు తీశారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు. గుడిపల్లెకు చెందిన లెక్చరర్ రామిరెడ్డి (65) అనారోగ్యంతో గతనెల 28న బెంగళూరులో మృతి చెందాడు. అతని అంత్యక్రియలను గుడిపల్లెలో నిర్వహిస్తుండగా ఒక్కసారిగా తేనెటిగలు దాడి చేయడంతో కార్యక్రమం నిర్వహిస్తున్న బంధువులు, గ్రామస్తులు పరుగులు తీశారు. పరిగెత్తేకొద్ది వెంటపడి కాటేయగా 30 మందికిపై గాయపడ్డారు. ఈ ఘటనను అందరూ మరచిపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం రామిరెడ్డి కర్మక్రియలు నిర్వహించేందుకు సమాధి వద్దకు వెళ్లారు. సమాధివద్ద పూజా కార్యక్రమాలు జరిపేందుకు మృతుడి భార్య శశికళ సిద్ధమవగా తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో భయంతో అందరూ పరుగులు తీయగా తప్పించుకునేందుకు శశికళ పక్కనే ఉన్న కారులోకి వెళ్లారు. విగిలిన వాళ్లు ఎక్కడిక్కడ దాక్కునే ప్రయత్నం చేశారు. వీరిలో ఆరుగురు తేనెటీగల కాట్లకు గురయ్యారు. చాలాసేపు తేనెటీగల దాడి కొనసాగగా కర్మక్రియలు జరగలేదు. గంట తర్వాత అవి వెళ్లిపోవడంతో సమాధివద్ద కార్యం ముగించారు.

గాలివానకు నేలకొరిగిన అరటిచెట్లు



ముక్కావారిపల్లిలో దెబ్బతిన్న అరటితోట వద్ద రైతు, ఆర్బీకే సిబ్బంది

ఓబులవారిపల్లె : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు 40 ఎకరాల్లో అరటిచెట్లు నేలకొరిగాయి. మండల పరిధిలోని ముక్కావారిపల్లి పంచాయతీలో 20 ఎకరాలు, వైకోట పంచాయతీలో 20 ఎకరాలు ధ్వంసమైంది. రూ. 40 లక్షలు పంటనష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారి ఆషియా తెలిపారు. దెబ్బతిన్న పంటను రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) సిబ్బంది పరిశీలించి వివరాలు నమోదు చేశారు. చాలాచోట్ల మామిడి కాయలు రాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడటంతో గ్రామాల్లో రాత్రంతా అంధకారం నెలకొంది.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

పీలేరు : రూ. 9.5 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధరరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో మండలంలోని పొంతలచెరువు వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ సందర్భంగా ఎర్రచందనం దుంగలతో వచ్చిన రినాల్ట్ డస్టర్ కారు, పైలట్‌గా వచ్చిన మారుతి సుజుకీ బ్రెజ్జా కారును ఆపి పరిశీలించారు. డస్టర్ కారులో 381 కేజీల బరువు గల 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. మారుతి సుజుకి కారులో ఉన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడినవారిలో తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కీలకొత్తూరుకు చెందిన ఎ. శరవణన్ అన్నామలై, తిరువణ్ణామలై జిల్లా నమ్మియంపట్టుకు చెందిన శివకుమార్‌పొన్నుస్వామి, ఆర్. దశరథన్ ఉన్నారు. ఎస్పీ మాట్లాడుతూ వేలూరుకు చెందిన రమేష్ వద్ద శరవణన్, రాజ్‌కుమార్ కారు డ్రైవర్లుగా ఉంటున్నారు. ఏలుమలై, గోవిందరాజు అనే వారు నమియంపట్టు పరిసర ప్రాంతాల్లో కూలీలను సేకరించుకుని శేషాచల అడవుల్లోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరికేవారు. కేవీపల్లె, పీలేరు, కలికిరి, మదనపల్లె మీదుగా వేలూరుకు ఎర్రచందనం తరలించి రమేష్‌కు విక్రయించేవారు. వారం రోజుల క్రితం శేషాచల అడవుల్లోకి ఎలుమలై గైడ్‌గా ఉండి సుమారు 14 మంది తమిళ కూలీలను తీసుకెళ్లి ఎర్రచందనం చెట్లు నరికించాడు.దుంగలను కారులో తరలిస్తూ సోమవారం పట్టుబడ్డారు. పారిపోయిన రాజ్‌కుమార్, ఏలుమలై, గోవిందరాజులను త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రకృతి సంపద అయిన ఎర్రచందనంను కాపాడడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజ్‌కమల్, డీఎస్పీ మహబూబ్‌బాషా, పీలేరు, కలకడ సీఐలు మోహన్‌రెడ్డి, నాగేంద్ర, పీలేరు, కేవీపల్లె ఎస్ఐలు నరసింహుడు, లోకేష్ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే అభివృద్ధి సాధ్యం

రాయచోటి అర్బన్ : మానవుల దగ్గర ఎలాంటి మంత్ర,తంత్రాలు లేవని, కేవలం సైన్స్ మాత్రమే అన్నింటికీ సమాధానం చెబుతుందని, సైన్స్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా సైన్స్‌అధికారి ఓబులరెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక(జేవీవీ)ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జేవీవీ సభ్యులతో కలసి వేసవివినోదం కరపత్రాలను విడుదల చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదంతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు జేవీవీ కృషిచేస్తుండడం అభినందనీయం అన్నారు. అనంతరం ఇంద్రజాలికుడు నాగేశ్వరరావు తన ఇంద్రజాల ప్రదర్శనతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. డైట్ లెక్చరర్ అసదుల్లాబాషా విద్యార్థులకు పజిల్స్ ఇచ్చి పరిష్కరించాలంటూ కోరడం ద్వారా వారిని ఆలోచింప చేశారు. కార్యక్రమంలో జేవీవీ నేతలు ప్రకాష్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, వై.సి.రెడ్డెప్పరెడ్డి, బయారెడ్డి, చక్రపాణి, శివారెడ్డి, రామక్రిష్ణ,రవీంద్రనాథరెడ్డి, రామచంద్రారెడ్డి, బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.